జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
మంగళవారం సెప్టెంబర్ 22, 2026 పేజీలు:17








02లో

జూరాల నీటి వినియోగంపై సమగ్ర ప్రణాళిక అవసరం - తాగునీటి భద్రతకు ప్రాధాన్యం.. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం : డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్



# జూరాల ఆయకట్టు పంటలకు నీళ్లివ్వమంటే అరెస్టులా?

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 21 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** జూరాల ఆయకట్టు కింద పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతుల పక్షాన నిలిచిన జిల్లా బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేశారు. శ్రీశైలం నుంచి సుమారు 660 కిలోమీటర్ల దూరంలోని పెన్నా బేసిన్‌లో ఉన్న కుప్పానికి నీటిని తరలిస్తున్నారని, అదే సమయంలో పాలమూరు ప్రాంత రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కృష్ణా జలాలను పోతిరెడ్డిపాడు, వెలిగొండ, మాల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడం ద్వారా పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు.

## జూరాలలో 8.8 టీఎంసీల నిల్వ నీరు

జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం 8.8 టీఎంసీల నీటి నిల్వ ఉందని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. తాగునీటి అవసరాలకు 2 టీఎంసీలు కేటాయించినప్పటికీ, మిగిలిన నీటిని వారబంధి విధానంలో సాగునీటికి వినియోగించి లక్ష ఎకరాల పంటలను కాపాడే అవకాశం ఉందని అన్నారు. అల్మట్టి, నారాయణపూర్ జలాశయాల్లో కలిపి సుమారు 155 టీఎంసీల నీటి నిల్వ ఉందని పేర్కొంటూ, కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం కనీసం కొంత నీటిని సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణా నదిలో నీటి ప్రవాహాలు ఉన్న సమయంలో భీమా, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాల పంపులను పూర్తి సామర్థ్యంతో నడపలేదని ఆయన ఆరోపించారు. నీటిని వినియోగించుకోకుండా వదిలిపెట్టడం వల్ల తెలంగాణకు నష్టం జరిగిందని విమర్శించారు.

## "రైతులు నీళ్లు అడిగితే చేతులకు సంకెళ్లు వేస్తారా?"

జూరాల ప్రాజెక్టు వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించి రైతులు, బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకోవడాన్ని శ్రీనివాస్ గౌడ్ తప్పుబట్టారు. రైతులు సాగునీరు కోరుతున్నారని, వారి సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అరెస్టులకు పాల్పడటం సరికాదని అన్నారు. "నీటి సమస్యపై రైతుల తరఫున ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా? ప్రభుత్వం చేసిన తప్పులకు రైతులు శిక్ష అనుభవించాలా?" అని ఆయన ప్రశ్నించారు. పంట పొలాలకు సాగునీరు అందించడంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు.

## వెంటనే సాగునీరు విడుదల చేయాలి

జూరాల ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని, అదుపులోకి తీసుకున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులను తక్షణమే విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# జూరాల నీటి వినియోగంపై సమగ్ర ప్రణాళిక అవసరం

## - తాగునీటి భద్రతకు ప్రాధాన్యం.. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం : డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** మొదటిపేజీ తరువాయి




జూరాల ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా వినియోగించాల్సిన అవసరం ఉందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అ గంపల్లి సంజీవ్ ముదిరాజ్ అన్నారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూరాల ప్రాజెక్టు నీటి విడుదల అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుని రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీజేపీ, బీఆర్ఎస్‌లపై విమర్శలు చేశారు. రైతుల సమస్యలపై రాజకీయాలు చేయడం కంటే వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో ప్రస్తుత వర్షపాతం, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహాలు, రిజర్వాయర్లలోని నీటి నిల్వలను సమగ్రంగా పరిశీలించి నీటి నిర్వహణ నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. జూరాలకు వచ్చే నీటి ప్రవాహాలు తగ్గిన సందర్భంలో భవిష్యత్ తాగునీటి అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. “జూరాలలో నీరు ఉన్నప్పుడు రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వానికి ఎలాంటి సంకోచం లేదు. అయితే భవిష్యత్‌లో తాగునీటి అవసరాలకు ఇబ్బంది కలగకుండా నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది” అని సంజీవ్ ముదిరాజ్ పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా గ్రామాలు, పట్టణాలకు తాగునీటి సరఫరాకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రకృతి అనుకూలించి తగినంత నీటి లభ్యత ఏర్పడితే ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త రిజర్వాయర్లు, చిన్న నీటి నిల్వల నిర్మాణం చేపట్టి నీటి వనరులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.“రైతుల సంక్షేమం, ప్రజల తాగునీటి భద్రత రెండింటినీ సమతుల్యంగా కాపాడటమే ప్రభుత్వ బాధ్యత. అందుబాటులో ఉన్న నీటి వనరులను శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది” అని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బెక్కరి మధుసూదన్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్, మొహిజ్, చందు యాదవ్, కె. సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణసంకటం

రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణసంకటం

### కల్వర్టుల వద్ద లోతైన గుంతలు.. ప్రమాదకరంగా మారిన రహదారి

### డైవర్షన్లు, హెచ్చరిక బోర్డులు లేక వాహనదారుల అవస్థలు

**గండీడ్, (ప్రజా జ్యోతి):**



రంగారెడ్డిపల్లి నుంచి దాదాపూర్ వరకు కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనుల్లో అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా పలు చోట్ల కల్వర్టులు ఏర్పాటు చేసినప్పటికీ, వాటి వద్ద మట్టిని సక్రమంగా పూడ్చి రోడ్డు స్థాయికి తీసుకురాకపోవడంతో రహదారి మొత్తం గుంతలమయంగా మారింది.కొత్తగా నిర్మించిన కల్వర్టుల వద్ద లోతైన గుంతలు ఏర్పడటంతో వాహనాలు అదుపుతప్పే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు స్పష్టంగా కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా రహదారిలో మరికొన్ని చోట్ల పనుల కోసం తవ్వకాలు చేపట్టినా, వాహనదారులను అప్రమత్తం చేసేందుకు డైవర్షన్ సూచికలు, డేంజర్ బోర్డులు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక లైట్లు ఏర్పాటు చేయకపోవడం మరింత ప్రమాదకరంగా మారింది. నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో కనీస భద్రతా చర్యలు పాటించాల్సి ఉన్నప్పటికీ అవి కనిపించకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు రోడ్డు పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు, పాఠశాల వాహనాలు, ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి పనులను పరిశీలించి, కల్వర్టుల వద్ద గుంతలను వెంటనే పూడ్చి, రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే పనులు పూర్తయ్యే వరకు ప్రమాదకర ప్రాంతాల్లో తప్పనిసరిగా డైవర్షన్ బోర్డులు, డేంజర్ సూచికలు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేసి వాహనదారుల భద్రతకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## రైతులు వేరుశెనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

### - ఎమ్మెల్యే డాక్టర్.కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి

**నగర్ కర్నూల్ : సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి)**

ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వేరుశెనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి అన్నారు. నాగర్ కర్నూల్ నియోజకవర్గంలోని తెలకపల్లి మండల కేంద్రంలో సోమవారం ప్రాథమికవ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో రైతులకు ఉచిత వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ భాస్కర్ రెడ్డి, వైస్చైర్మన్ యాదయ్య,కాంగ్రెస్ నాయకులు బండ పర్వతాలు,కొత్తపల్లి వినోద్ కుమార్,స్థానిక రైతులు పాల్గొన్నారు.



# అక్రమ అరెస్టులతో మా గొంతును నిర్బంధించలేరు రేవంత్ రెడ్డి

## బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు మరియు జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య

**ఆలంపూర్ సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జూరాల దగ్గర రైతులకు నీళ్లు ఇవ్వాలని ధర్నా కార్యక్రమానికి సోమవారం పిలుపునిచ్చిన సందర్భంగా ముందస్తుగా అర్ధరాత్రి అక్రమ అరెస్టు చేయడం రేవంత్ రెడ్డి సర్కార్ సిగ్గుచేటు అని అన్నారు.. బీఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్యను గద్వాల టౌన్ పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేసి గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు..రేవంత్ రెడ్డి సర్కార్ ఎన్ని అక్రమ అరెస్టు చేసిన రైతులకు నీళ్లు ఇవ్వాల్సిందే.నీళ్లు విడుదల చేసేంత వరకు వదిలిపెట్టమని ఈ సందర్భంగా హెచ్చరించారు..ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య మాట్లాడుతూ.. మన నీళ్లకు రేవంత్ రెడ్డి సంకెళ్లు వేయడం దుర్మార్గం కుట్రపూరితం తక్షణమే రైతులకు జూరాల నీటిని విడుదల చేయాలి దేనికోసం జూరాల కుడి ఎడమ కాలువ గేట్లను మూస్తున్నావు రేవంత్ రెడ్డి ఆంధ్రకు తరలించడానికి కోసమా...! రేవంత్ రెడ్డి జూరాల నుండి నీళ్ళు ఎందుకు ఇస్తలేవు..? మీ గురువు చంద్రబాబు నాయుడు కళ్ళలో ఆనందం చూడడం కోసమా...! గురువు చంద్రబాబు నాయుడు కోసం జూరాల నీళ్లను నిలువ చేస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్.. తెలంగాణ రాష్ట్ర రైతుల నోట్లో మట్టి కొట్టి నీళ్లను ఆంధ్రకు దార దత్తం చేస్తున్న రేవంత్ రెడ్డి... పాలమూరును పండబెడుతున్న పాలమూరు బిడ్డ రేవంత్ రెడ్డి.. మన నీళ్లు మనం వాడుకోవడానికి నిర్బంధాల...? ఎవరికోసం మీరు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించేది రాహుల్ గాంధీ కోసమా లేక చంద్రబాబునాయుడు కోసమా...? తక్షణమే జూరాల గేట్లను ఎత్తి రైతులకు నీళ్లు ఇవ్వాలి లేని పక్షంలో పెద్ద ఎత్తున రైతుల ఆగ్రహంనకు రేవంత్ రెడ్డి సర్కార్ మూల్యం చెల్లాలి చెల్లించాల్సిందే... పాలమూరు బిడ్డ చేతిలో పాలమూరు జిల్లా బలిపీఠం ఎక్కడ చాలా



బాధాకరం..పాలమూరు జిల్లాకు నీళ్లు ఇవ్వలేని దుస్థితిలలో రేవంత్ రెడ్డి సర్కారు ఉండడం సిగ్గుచేటు అని అన్నారు.

# భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయండి

- సబ్‌కలెక్టర్‌కు వినతి.. 15 రోజుల్లో విచారణ నివేదిక ఇవ్వాలని ఆదేశం

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి బ్యూరో)**

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం కోసం వ్యవసాయ భూములు కోల్పోయిన తమకు న్యాయం చేయాలని రాయిచేడు గ్రామానికి చెందిన బాధిత రైతులు కోరారు. ఉప్పునుంతల మండలం రాయిచేడు గ్రామంలో నిర్మిస్తున్న పాఠశాల ప్రదేశంలో తమకు చెందిన వ్యవసాయ భూములు కోల్పోయామని, నిర్మాణ పనులు ప్రారంభమై ఏడాది గడుస్తున్నా తమ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం అచ్చంపేట సబ్‌కలెక్టర్ సలోని ఛాబ్రాను కలిసి బాధిత రైతులు వినతిపత్రం అందజేశారు. భూమికి సంబంధించిన పాత, కొత్త పాస్‌బుక్‌లను వినతిపత్రంతో పాటు జతచేసి సమర్పించారు. ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, పాఠశాల నిర్మాణం కోసం భూములు కోల్పోవడంతో జీవనోపాధి, కుటుంబ పోషణ ప్రశ్నార్థకంగా మారిందని రైతులు వాపోయారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, జీపీఓ అధికారులకు విన్నవించడంతో పాటు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించినా ఇప్పటివరకు న్యాయం జరగలేదన్నారు.భూములు కోల్పోయిన రైతులకు ప్రత్యామ్నాయ భూములు కేటాయించడంతో పాటు న్యాయపరమైన పరిష్కారం చూపి ఆదుకోవాలని సబ్‌కలెక్టర్‌ను కోరారు. స్పందించిన సబ్‌కలెక్టర్ సలోని ఛాబ్రా వెంటనే ఉప్పునుంతల తహసీల్దార్‌తో చరవాణిలో మాట్లాడి దరఖాస్తుపై విచారణ చేపట్టాలని ఆదేశించారు. 15 రోజుల్లో పూర్తి సమాచారంతో నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో బాధిత రైతులు ఎత్తపు నిరంజన్, ఇంజమూరి ఆంజనేయులు, రైతు కుటుంబ సభ్యులు గోరటి శ్రీనివాసులు, మధు పాల్గొన్నారు.




# దసరా సెలవులు ను ప్రకటించిన ప్రభుత్వం

**ఆలంపూర్ సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

తెలంగాణలో మొత్తం 13 రోజుల పాటు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. దసరాతో పాటు బతుకమ్మ కూడా వస్తుండటంతో ఎక్కువ రోజులు సెలవులు ఇచ్చింది. అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 22 వరకు దసరా సెలవులు ప్రకటించారు. అలాగే విద్యాసంస్థలకు చివరి వర్కింగ్ డే అక్టోబర్ 9. ఆ తర్వాత సెలవుల అనంతరం అక్టోబర్ 23వ తేదీనుంచి విద్యాసంస్థలు తిరిగి తెరుకుంటాయి. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థలకు ఈ సెలవులు వర్తిస్తాయి. తప్పనిసరిగా అన్ని సంస్థలు వీటిని అమలు చేయాల్సి ఉంటుంది.



# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించాలి

## జిల్లా పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు పులిపాటి వెంకటేష్

**గద్వాల సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ ఉద్యమం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు, కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్ అన్నారు.కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ,వర్ధంతి సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గద్వాల పట్టణం ఈదమ్మ గుడి సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పులిపాటి వెంకటేష్ మాట్లాడుతూ,1969 తొలి దశ తెలంగాణ ఉద్యమం నుంచి మలిదశ ఉద్యమం వరకు తెలంగాణ కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ ఎన్నో త్యాగాలు చేశారని తెలిపారు.తెలంగాణ సాధన కోసం తన ఇంటినే దానం చేసిన మహనీయుడని,స్వాతంత్ర్య సమరయోధుడిగా,మంత్రిగా పనిచేసినప్పటికీ తెలంగాణ కోసం మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.పద్మశాలి సామాజిక వర్గంలో జన్మించిన కొండా లక్ష్మణ్ బాపూజీ మన పద్మశాలి సమాజానికి గర్వకారణమని అన్నారు.ఆయన ఆశయాలు,సేవా స్ఫూర్తిని నేటి తరం కొనసాగించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సేవా సంఘం సభ్యులు,పట్టణ పద్మశాలి సేవా సంఘం సభ్యులు,యువజన పద్మశాలి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.చిల్లర సాయిబాబా,చిలువరి సురేష్,పారుపల్లి రఘు,తిరుమల రాము,నీలి వెంకట్ స్వామి,పారుపల్లి ఆంజనేయులు,బిజ్జా కృష్ణ,బుధవార్పు భాస్కర్,ద్వారపు నాగరాజు తదితరులు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



# అంగన్వాడి నూతన భవనాల నిర్మాణానికి కోటి 20 లక్షల నిధులు మంజూరు

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి

**నర్వ సెప్టెంబర్ 21 ప్రజా జ్యోతి**

ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో నే. వెనకబడిన నర్వ మండలంలోని ఆయా గ్రామాలలో నూతన అంగనవాడి భవనాల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం నిధుల తో మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణమ్మ చోరవతో కోటి 20 లక్షల నిధులు మంజూరైన అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంతరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు, మండలాలలో ఒకటిగా గుర్తింపు పొందిన నర్వ మండల కేంద్రాన్ని (ఆస్పిరేషనల్ బ్లాక్) గతంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డీకే అరుణమ్మ ఆధ్వర్యంలో, సందర్శించి నర్వ మండలంలోని అంగన్వాడీ కేంద్రాలకు నూతన భవనాల సమస్యలపైన దృష్టి సారించిన విషయం మండల ప్రజలకు తెలిసిన విషయమే అందులో భాగంగానే జేజమ్మ కృషితో, బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి సహకారంతో, బండి సంజయ అన్న ద్వారా కేంద్ర ప్రభత్వం నుండి నర్వ మండల కేంద్రానికి మొదటి విడతగా 8 నూతన అంగన్వాడీ భవనాలకు గాను (ఒక కోటి ఇరవై లక్షలు) రూపాయలను మంజూరు చేయడం జరిగిందన్నారు, డీకే అరుణమ్మ కు, బండి సంజయ్ గారికి మరియు బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి , అన్నగారికి నర్వ మండలం తరపున హృదయ పూర్వక అభినందనలు తెలుపుతూ, ఇట్టి పనులను వీలయినంత త్వరలో ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఎంపీడీకేరణమా ఆదేశించినట్లు తెలిపారు ఇట్టి కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబెర్ శ్రీమతి లలితా వెంకట్ రెడ్డి , మండల బిజెపి పార్టీ అధ్యక్షులు అజిత సింహ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీ విజయ్ రామ్ ,శ్రీ అశోక్ కుమార్ గౌడ్ మరియు శ్రీ అయ్యప్ప స్వామి పాల్గొన్నారు.



# రామ్ మందిర్ వినాయక పూజా కార్యక్రమంలో పాల్గొన్న

## కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు బి సం చెన్నయ్య సాగర్ , నాయకులు





**నర్వ సెప్టెంబర్ 20 ప్రజా జ్యోతి**

నర్వ లోని రామ్ మందిర్ వినాయక పూజా కార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్, అంతకంటే ముందు జరిగిన అన్నదాన హారతి పూజా కార్యక్రమంలో అంబేద్కర్ మండల యువజన సంఘం అధ్యక్షులు దండ అయ్యప్ప, ఆర్యన్ గ్రూపు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు. అన్నదాన దాత వెంకట గళ్ళ ఆంజనేయులు సీనియర్ పాత్రికేయులు , ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం జరిగింది, ఈ అన్నదాన కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెటింగ్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నర్వ గ్రామం ఉప సర్పంచ్ దండు అజయ్ కాంగ్రెస్ నాయకులు, శరణప్ప, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజనేయ రెడ్డి, గడ్డం నరసింహ, బోయపాటి నరసింహ, వెంకట్రామారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# 74 మంది ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందజేసిన

## అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు

**ఆలంపూర్ సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని అలంపూర్ ‌శ రోడ్డు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అయిజ, మానవపాడు, అలంపూర్ మండలాలకు చెందిన 74 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.74,08,584 విలువైన చెక్కులను అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు అందజేశారు.

**( హామీల అమలుపై మహిళల ప్రశ్నలు)**

ఈ సందర్భంగా కొంతమంది మహిళలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి పథకం కింద పెళ్లైన ఆడపడుచులకు రూ.1,00,116తో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు అమలు చేయలేదని ప్రశ్నించారు.దీనిపై ఎమ్మెల్యే విజయుడు స్పందిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీల్లో భాగంగా పెళ్లైన ఆడపడుచులకు తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం



అందిస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలు పూర్తవుతున్నా హామీలు అమలు కాలేదని విమర్శించారు.రూ.1,00,116తో పాటు తులం బంగారం హామీని కూడా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, హామీలు నెరవేర్చకపోతే



రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన సమాధానం చెబుతారని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ధర్నాతో దద్దరిల్లిన జమ్మిచేడు

## 24 గంటల్లో నీళ్లు ఇస్తామని అధికారుల హామీ

**గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 21:**

జూరాల కుడి కాలువల ద్వారా రైతులకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జమ్మిచేడు వద్ద రైతులు,బీఆర్ఎస్ శ్రేణులు గద్వాలకర్నూలు ప్రధాన రహదారిపై బైఠాయించి భారీ ధర్నా నిర్వహించారు.మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసనలో రైతులు వరి నాట్లను చేతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకుముందు కలెక్టరేట్ నుంచి జమ్మిచేడు వరకు రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా బాసు శ్యామల మాట్లాడుతూ,జూరాల కుడి కాలువల గేట్లను ఎందుకు మూసివేశారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని,వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రైతులకు నీరు అందే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ధర్నా నేపథ్యంలో అధికారులు 24 గంటల్లోపు నీటిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# భవిష్యత్తులో బడుగు బలహీన వర్గాలకు సేవ చేయాలి

**ఎక్స్ ఆర్మీ మైరాముడు**

**ఎంబీ,బీఎస్, హెచ్‌సీఎల్ టెక్‌బీలో సీట్లు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం**

**అభినందనలు తెలిపిన ప్రజాసంఘాల నాయకులు**

**ఆలంపూర్ సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

అయిజ పట్టణానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించడంతో పాటు మరో విద్యార్థి హెచ్‌సీఎల్ టెక్‌బీకి ఎంపికైన సందర్భంగా మాజీ సైనికుడు ఇటిక్యాల మైరాముడు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించారు. పులికల్ ప్రభాకర్ స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులు సత్యాన్వేష్ (తండ్రి ప్రభాకర్), కళ్యాణ్ రాజ్ (తండ్రి రాజు), గీతిక (తండ్రి రమేష్), అలాగే హెచ్‌సీఎల్ టెక్‌బీకి ఎంపికైన విద్యార్థి వి.సువాబన్ (తండ్రి వి. రాజు)లను మరియు వారి తల్లిదండ్రులను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మైరాముడు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దళితులు ఉన్నత విద్యను అభ్యసించాలని, విద్య ద్వారానే సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఎంబీబీఎస్ సీట్లు సాధించడం విద్యార్థుల కష్టపడి చదివిన తీరుకు నిదర్శనమని, ఇది గర్వించదగ్గ విషయమన్నారు.విద్యార్థులు భవిష్యత్తులో వైద్యులుగా స్థిరపడిన అనంతరం సమాజంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవ చేయాలని ఆయన సూచించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని ఆకాంక్షించారు.అదేవిధంగా హెచ్‌సీఎల్ టెక్‌బీకి ఎంపికైన విద్యార్థి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని, భవిష్యత్తులో సొంతంగా కంపెనీలు స్థాపించే స్థాయికి చేరుకోవాలని మైరాముడు ఆకాంక్షించారు. కష్టపడి చదివి సీట్లు సాధించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలకు దిశానిర్దేశం చేస్తూ ఉన్నత విలువలతో ముందుకు సాగేలా ప్రోత్సహించిన ప్రజాసంఘాల నాయకులకు, ముఖ్యంగా మాజీ సైనికుడు మైరాముడుకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల విజయాన్ని గుర్తించి సన్మానించడం తమలో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు విశ్రాంత ఉపాధ్యాయులు ప్రభుదాసు, అలెగ్జాండర్, ప్రసంగి, ఇమ్మానేలు, బుచ్చన్న, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# నర్సింగ్ కళాశాల విద్యార్థులకు 35 లక్షల నూతన బస్సు

## - ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా

**గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 21:**



35 లక్షల రూపాయలు వ్యయంతో గద్వాల ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా నర్సింగ్ కళాశాల విద్యార్థులకు నూతన బస్సును ప్రారంభించారు.జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో నర్సింగ్ కళాశాల విద్యార్థులకు నూతన బస్సును ఏర్పాటు చేయడం జరిగింది.ఎమ్మెల్యే సతీమణి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది.నూతన బస్సులో ఎమ్మెల్యే దంపతులు విద్యార్థులతో కలిసి ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో 10 ఫిర్యాదుల స్వీకరణ

**గద్వాల సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జోగుళాంబ గద్వాల్ జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాస రావు, ఐపీఎస్., ప్రజల నుంచి 10 ఫిర్యాదులను స్వీకరించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా తెలుసుకుని, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఫిర్యాదులను చట్టపరంగా పరిశీలించి, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోందన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి ఫిర్యాదులను స్వీకరించాలని సూచించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్రీవెన్స్ డేలో స్వీకరించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడానికి ప్రజావాణి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ రోజు స్వీకరించిన ఫిర్యాదుల్లో ప్లాట్ల ఆక్రమణకు సంబంధించి 1, భూ వివాదాలకు సంబంధించి 6, భర్త వేధింపులకు సంబంధించి 1, ఇతర అంశాలకు సంబంధించి 2 ఫిర్యాదులు ఉన్నాయి.



# భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తాం:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

## - నిర్వాసితులకు పరిహారం,పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతులు

**గద్వాల సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి ప్రతినిధి):**



ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను వేగవంతం చేయడంతో పాటు,భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించడం,నిర్వాసితుల కోసం పునరావాస కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,బీసీ సంక్షేమ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ, నిర్వాసితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటు,అటవీ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై ఈ సమావేశంలో సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ,రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను విడతలవారీగా విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే విడుదలైన నిధులను భూములు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం చెల్లించడంతో పాటు పునరావాస కేంద్రాల ఏర్పాటుకు వినియోగించాలని సూచించారు. కలెక్టర్ల ఖాతాల్లో అందుబాటులో ఉన్న నిధులను యుద్ధప్రాతిపదికన రైతులకు పరిహారం చెల్లించేందుకు,భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు వినియోగించాలని ఆదేశించారు.అదేవిధంగా పునరావాస కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిధులు ఖర్చు చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ,కలెక్టర్లు రైతులతో చర్చించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.రాబోయే యాసంగి సీజన్‌లో సాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.గద్వాల నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ,నెట్టెంపాడు,గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రైతులతో చర్చిస్తూ వారిని ఒప్పించి ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.భూసేకరణ పూర్తయిన రైతులకు అవార్డులు పాస్ చేసి,పరిహారం చెల్లించేందుకు అవసరమైన నిధులను వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య సేవలు.. మందుల పంపిణీ యోగ, మెడిటేషన్తో ఆరోగ్యంపై అవగాహన

**ఆలంపూర్ సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**




రాజోలి మండలం ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజోలి గ్రామంలో గ్రామంలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ అండ్ వెల్నెస్ క్యాంప్ నిర్వహించారు. ప్రకృతి పరీక్షన్, పోషణ్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా అంగన్వాడీ కేంద్రాలతో సమన్వయంతో పలు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించి, ఆయుర్వేద ఆధారిత పోషణపై అవగాహన కల్పించారు. లైఫెల్ అసెస్మెంట్ ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానంపై సూచనలు అందించారు. యోగ, మెడిటేషన్ కార్యక్రమాలను నిర్వహించి శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం పలు వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగిరెడ్డి , వైద్యాధికారి డాక్టర్ మెహఫూజ్ ఫుల్ హక్ ,ఫార్మసిస్టు యాస్మిన్ ఇతర గ్రామస్తులు పాల్గొనడం జరిగింది

# పిడుగుపాటుకు బాలుడు మృతి

**గద్వాల సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి ప్రతినిధి):**



పొలం నుంచి ఇంటికి తిరిగి వస్తున్న 16 ఏళ్ల బాలుడు పిడుగుపాటుకు మృతి చెందిన విషాద ఘటన కేటీ దొడ్డి మండలం యర్సన్దొడ్డి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన కుర్వ వెంకటేష్ కుమారుడు మల్లేష్ (16) పొలం నుంచి ఇంటికి వస్తుండగా వర్షం కురిసింది.దీంతో కృష్ణస్వామి దేవాలయం సమీపంలోని చెట్టు కిందకు వెళ్లి నిల్చున్నాడు.అదే సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఊట్కూర్ లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్‌ను తొలగించి నూతన కమిటీ ఏర్పాటు చేయాలి

రైతుల నుండి అక్రమంగా వసూలు చేసిన లిఫ్ట్ చైర్మన్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

ఎంమ్మార్పీఎస్ టీస్ జిల్లా అధ్యక్షుడు మల్లేపోగు లక్ష్మణ్ మాదిగ

**ఆలంపూర్ సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

ఊట్కూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోనేరు గ్రామానికి చెందిన లిఫ్ట్ ఇరిగేషన్ రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో ఇరిగేషన్ డీఈ రాజ్యలక్ష్మికి ఎమ్మార్పీఎస్-టీఎస్ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు మల్లేపోగు లక్ష్మణ్ మాదిగ వినతిపత్రం అందజేశారు. ఊట్కూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలో సుమారు 1,300 ఎకరాల భూములకు సాగునీరు అందుతుందని, గత 11 సంవత్సరాలుగా ఈ లిఫ్ట్ ద్వారా రైతులు సాగు నీటిని వినియోగించుకుంటున్నారు.అయితే లిఫ్ట్ చైర్మన్‌గా నర్సన్ గౌడ్ సుమారు పదేళ్లుగా ఏ లిఫ్ట్ ఇరిగేషన్ కమిటీలు అయినా సంవత్సరానికి లేదా రెండు సంవత్సరాలకు నూతన కమిటీని రైతులు ఏర్పాటు చేసుకుంటారు, ప్రస్తుతం ఉన్న ఉట్కూరు లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ తానే ఏకపక్షంగా వ్యవహరించి నూతన కమిటీని ఏర్పాటు కాకుండా రాజకీయ అండదండలతో రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు, కావున ఇరిగేషన్ డిపార్ట్మెంటు అధికారులు జిల్లా కలెక్టర్ స్పందించి అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకొని నూతన కమిటీని ఏర్పాటు చేసుకునే విధంగా రైతులకు సహకారం అందించాలని మనవి చేస్తున్నాం. అదేవిధంగా లిఫ్ట్ ద్వారా సాగునీరు అందించేందుకు ఒక్కో తడికి రూ.1,000 చొప్పున వసూలు చేస్తున్నారని,. ఒక పంటకు సుమారు పది తడులు అవసరమైతే ఒక్కో రైతుపై దాదాపు రూ.10 వేల వరకు భారం పడుతోందని, అయితే రైతులకు అవసరమైన సమయంలో సక్రమంగా నీరు అందడం లేదు.గత పదేళ్లుగా రైతుల నుంచి వసూలు చేసిన డబ్బుల పైన విచారణ జరిపి ఆ యొక్క అమౌంట్ను లిఫ్ట్ ఇరిగేషన్ డెవలప్మెంట్ కు ఖర్చు చేయాలి.ఒకే వ్యక్తి దీర్ఘకాలంగా చైర్మన్‌గా కొనసాగుతున్న వ్యవహారంపై విచారణ జరిపి, నిబంధనల ప్రకారం నూతన లిఫ్ట్ చైర్మన్, కమిటీని ఏర్పాటు చేయాలి లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాం.ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న వారు బి. మధు, చిన్న పుల్లన్న, రాజా రమేష్, బి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# గణేశుని ఆశీస్సులతో లడ్డూ దక్కించుకున్న సర్పంచ్

## - లడ్డూ వేలంలో4 లక్షల 50 వేల కు కైవసం

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 21( ప్రజా జ్యోతి బ్యూరో)**

హైదరాబాదులో దిల్ రాజు కార్యాలయంలో నిర్వహించిన గణేశ్ లడ్డూ వేలం పాటలో తెలకపల్లి మండల పరిధిలోని గడ్డంపల్లి గ్రామ సర్పంచ్ వెన్నెల శేఖర్ 4 లక్షల 50 వేలు , లడ్డూను దక్కించుకున్నారు.ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేస్తూ, గణనాథుని ఆశీస్సులు గడ్డంపల్లి గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, గ్రామం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరంగణపతి బప్పా మోరియా అంటు నినాదాలు చేశారు



# సత్యసాయి నర్సింగ్ హోమ్ లో గర్భస్థ శిశువు మృతి

## - వైద్యుల నిర్లక్ష్యంపై కుటుంబ సభ్యుల నిరసన

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్: నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీ సత్యసాయి నర్సింగ్ హోమ్ లో గర్భస్థ శిశువు మృతి చెందిన ఘటన సోమవారం కలకలం రేపింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం తాడూర్ మండలం ఇంద్రకల్ గ్రామానికి చెందిన 38 ఏండ్ల గర్భిణి పార్వతి సోమవారం శ్రీ సత్యసాయి ఆసుపత్రికిరాగా,టిఫాస్కాన్‌లో శిశువు ఆరోగ్యంగా ఉం దని వైద్యులు తెలిపారని ఐతే కొంతసేపటి తర్వాత ఆపరేషన్ అనంతరం మగ గర్భస్థ శిశువు మృతిచెందిదని కుటుంబ సభ్యులకు సమాచారం అందినట్లు తెలిపారు.గర్భిణికి డయాబెటిస్ ఉన్న విషయం ముందుగానే తెలిసినప్పటికీ తగిన వైద్య పర్యవేక్షణ జరగలేదని,వైద్యులు సూచించిన ప్రకా రంగానే తాము నడుచుకున్నప్పటికీ ఈఘటన చోటుచేసుకుందని కాన్పుతేదీపై స్పష్టమైన సమాచారం ఇవ్వలేదని, వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బాబు ప్రాణాలు కోల్పోయాడని ఈ ఘటన పై పూర్తిస్థాయి వైద్యవిచారణ చేపట్టి,అసలు కారణాలను వెల్లడించాలని, టిఫా స్కాన్‌లో శిశువు ఆరోగ్యంగాఉందని చెప్పిన తర్వాత కొద్దిసేపటికే మృతి చెందడానికి కారణాలేమిటనే అంశంపై స్పష్టత రావాల్సిఉంది.ఈ ఆరోపణలపై ఆసుపత్రి యాజమాన్యం/సంబంధిత వైద్యులవివరణ అందాల్సిఉంది.



# వెన్నచేడ్‌లో లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం

## 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు.. గ్రామ ప్రజలకు మెరుగుపడనున్న విద్యుత్ సరఫరా

**గండీడ్:(ప్రజా జ్యోతి)**

వెన్నచేడ్ గ్రామంలో కొంతకాలంగా నెలకొన్న లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య సమస్యను గండీడ్ మండల ఏఈ శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి గ్రామానికి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేసి ఏర్పాటు చేయించారు. నూతనంగా ఏర్పాటు చేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య పూజలు నిర్వహించి, స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. దీంతో గ్రామంలో విద్యుత్ వోల్టేజ్ సమస్య తగ్గి, విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సహకరించిన ఏఈ శ్రీకాంత్‌కు సర్పంచ్‌తో పాటు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవికాంత్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పుష్పలత గోపాల్, వార్డు సభ్యులు శేఖర్, నర్సింలు గౌడ్, కామి సంజీవులు, గ్రామ పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# పాలమూరు రైతాంగాన్ని పణంగా పెట్టిన రేవంత్ సర్కార్

## జూరాల నలువైపులా పోలీస్ జులుం దారుణం పోరాడుతున్న రైతులపై లాఠీ-చార్జి హేయం

## మంత్రులు జూపల్లి,వాకిటి లు వైదొలగాలి ఊరూరా హస్తం గుర్తుకు శవ యాత్రలు

## రైతులకు అండగా నిలిచిన బీఆర్ ఎస్ నేతల అరెస్ట్ లు సిగ్గుచేటులి

## కేసీఆర్ గారు,కేటీఆర్ గార్ల అనుమతితో గద్వాల్ లో పల్లె పిడికిలి పోరు సభ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ విమర్శలు

**ఆలంపూర్ సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**



కృష్ణా నది ప్రవాహాన్ని కుట్రపూరితంగా ఏపీకి వదిలేసి రిజర్వాయర్లను ఎండమావులుగా మార్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వంత జిల్లా రైతాంగాన్ని రాజకీయాలకు పణంగా పెట్టాడని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రెండున్నరేళ్లుగా నదీజలాల అంశంలో రేవంత్ సర్కార్ విషపూరిత ధోరణిని అవలంభిస్తోందని దుయ్యబట్టారు. ఉమ్మడి పాలమూరులో 50టీఎంసీల నిల్వ సామర్థ్యంతో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన సాగు నీటి ప్రాజెక్టులను కావాలనే కాంగ్రెస్ పాలకులు ఖాళీ కుండల్లా మార్చేసారని ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే జూరాల ఆధారిత రిజర్వాయర్లను ఎండబెట్టి కుప్పం కు కప్పం కట్టేందుకు నడిగడ్డ రైతులతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఉన్న రిజర్వాయర్లను నింపి, నీళ్లిచ్చే చేవలేని హస్తం సర్కార్, కమీషన్ ల కోసం ర్యాలంపాడు, గుడెందొడ్డి రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం పెంచుతామని గప్పాలు కొట్టడం అసహ్యంగా ఉందన్నారు.ఎండిపోతున్న పంటలను చూసి గుండెలు మండిన రైతులు పోరాడుతుంటే, జూరాల నలువైపులా పోలీస్ జులుం కు దిగడం దారుణమన్నారు.రైతులపై సర్కార్ దాడికి బాధ్యత వహించి మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అన్నదాతలకు అండగా నిలిచిన బీఆర్ ఎస్ నేతలను అరెస్ట్ చేయడం దుర్మార్గమని ఖండించారు.ఈ దుర్మార్గపు సర్కార్ వైఖరిని వ్యతిరేకిస్తూ ఊరూరా హస్తం గుర్తుకు రైతులు శవ యాత్రలు చేస్తున్నారని తెలిపారు.రైతాంగానికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆపదని హెచ్చరించారు. కేసీఆర్ , కేటీఆర్ అనుమతితో త్వరలో గద్వాల్ లో "పల్లె పిడికిలి పోరు సభ" ను రైతుల పోరు ప్రభంజనంలా నిర్వహిస్తామని డాక్టర్ ఆంజనేయ గౌడ్ హెచ్చరించారు.

# పోలీస్ ప్రజావాణికి 13 వినతులు

- వినతులను చట్టప్రకారం పరిష్కరించాలని

- జిల్లా ఎస్.పి సంగ్రామ్ సింగ్ పాటిల్

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి)**

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావా ణి కార్యక్రమంలో ఫిర్యాదు దారుల నుండి 13 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ స్వీకరించి ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధి త అధికారులకు సూచనలు చేశారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 13 ఫిర్యాదులలో భూమికి సంబంధించిన అర్జీలు 7,తగు న్యాయం సంబంధించిన అర్జీలు 5,భార్యభర్తల గొడవలు 1 పిర్యాదులను స్వీకరించిన ఎస్.పి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ అధి కారులకు సూచనలు చేసారు.అనంతరం ఎస్.పి మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలకు తావు లే కుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవలు వినియోగించుకోవాలని,సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా పోలీసులు ప్రజలకు దగ్గరయ్యేలా,శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ముందుకు సాగడమే ల క్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలియజేశారు.



# అదనపు కలెక్టర్ కాళ్లపై పడి నీళ్లు విడుదల చేయాలని మొరపెట్టుకున్న మహిళ రైతులు

- 4 గంటలుగా రోడ్డుపైనే రైతుల నిరసన.

10 కిలోమీటర్ల మేర నిలిచిపోయిన ట్రాఫిక్

**గద్వాల ప్రజా జ్యోతి సెప్టెంబర్ 21:**

జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మహిళా రైతులు రోడ్డెక్కారు. పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ నాలుగు గంటలుగా రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా గద్వాల అదనపు కలెక్టర్‌ను కలిసి తమ గోడును వెల్లబోసుకున్న మహిళా రైతులు,నీళ్లు విడుదల చేయాలని వేడుకుంటూ ఆయన కాళ్లపై పడి మొరపెట్టుకున్నారు. జూరాల నుంచి తమ పంటలకు అవసరమైన నీటిని వెంటనే విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా సాగునీటి కోసంఎదురుచూస్తున్నామని,నీరు అందకపోతే పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల నిరసనతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి.సుమారు 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.అధికారులు వెంటనే స్పందించి జూరాల నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు.



# కళాజాతా ద్వారా హెచ్ఐవీ, లైంగిక వ్యాధులపై అవగాహన

- సురక్షితమైన, బాధ్యతాయుతమైన ప్రవర్తనపై ప్రజలకు అవగాహన కల్పించాలి : జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో పాటు లైంగికంగా సంక్రమించే వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కళాజాతా ప్రచార కార్యక్రమాన్ని సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా పాత జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ నివారణ, సురక్షితమైన మరియు బాధ్యతాయుతమైన ప్రవర్తన, హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్షను నిర్మూలించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మరియు సాధారణ ప్రజలకు సరైన ఆరోగ్య సమాచారాన్ని చేరవేయడంలో కళాజాతా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

**ఏడు ప్రశ్నలతో స్వీయ ప్రమాద అంచనా**

కళాజాతా కార్యక్రమంలో భాగంగా చతురస్ర సంకేతాన్ని (క్యూఆర్ కోడ్) స్కాన్ చేసి ‘బ్రేక్ ఫ్రీ’ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం, అందులోని ఏడు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ద్వారా స్వీయ ప్రమాద అంచనా పూర్తి చేయడంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ స్వీయ ప్రమాద అంచనా ద్వారా హెచ్ఐవీ, లైంగికంగా సంక్రమించే వ్యాధులకు సంబంధించి వ్యక్తిగతంగా ఎదురయ్యే ప్రమాద పరిస్థితులపై అవగాహన పొందడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో సంబంధిత ఆరోగ్య సేవలను పొందేందుకు మార్గదర్శకత్వం లభిస్తుందని పేర్కొన్నారు. కళాజాతా కార్యక్రమాలకు హాజరయ్యే విద్యార్థులు, యువత మరియు ప్రజలు చతురస్ర సంకేతాన్ని స్కాన్ చేసి ‘బ్రేక్ ఫ్రీ’ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఏడు ప్రశ్నల స్వీయ ప్రమాద అంచనాను పూర్తి చేసేలా సిబ్బంది ప్రోత్సహించాలని డా. శ్రీనివాసులు సూచించారు.

**పాటలు, నాటికలతో విస్తృత ప్రచారం**



జిల్లాలోని అధిక ప్రమాద ప్రాంతాలు, విద్యాసంస్థలు, ప్రజలు అధికంగా సందర్శించే ప్రదేశాల్లో కళాజాతా బృందాలు పర్యటించనున్నాయి. పాటలు, నాటికలు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే వ్యాధుల నివారణ, పరీక్షలు మరియు అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నాయి. ఈ ప్రచార కార్యక్రమాన్ని లక్ష్యిత జోక్య సంస్థలు, ఎల్‌డబ్ల్యూఎస్ మరియు భాగస్వామ్య స్వచ్ఛంద సంస్థల సిబ్బంది సమన్వయంతో నిర్వహిస్తున్నారు. ప్రజలు కళాజాతా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని హెచ్ఐవీ, ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే వ్యాధుల నివారణకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవాలని, అవసరమైన సందర్భాల్లో పరీక్షలు మరియు ఆరోగ్య సేవలను వినియోగించుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. శశికాంత్, అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. రాజు నాయక్, మానసిక ఆరోగ్య జాతీయ కార్యక్రమ సమన్వయకర్త డా. శివకాంత్, ఆరోగ్య విద్యావేత్త హన్మంతు, శ్రీశైలం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# మెడికల్ ఇన్వాలిడేషన్ కేసులపై కలెక్టర్ పరిశీలన

## - నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

దీర్ఘకాలిక అనారోగ్యం, ఇతర వైద్య కారణాల వల్ల ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించలేని పరిస్థితిలో ఉన్న ఉద్యోగులకు సంబంధించిన వైద్య అనర్హత కేసులను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులను కలెక్టర్ నేరుగా కలుసుకుని వారి ఆరోగ్య పరిస్థితి, ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడంలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం సంబంధిత వైద్య అధికారులతో కేసుల వివరాలపై చర్చించారు. వైద్య అనర్హత కేసులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలించాలని జిల్లా వైద్య అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఉద్యోగుల అర్హత, వైద్య పరిస్థితి, కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను కమిటీ పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.

### అర్హత నిర్ధారణ తర్వాతే నిర్ణయం

వైద్య అనర్హత నిర్ధారణైన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నిబంధనల ప్రకారం ఉద్యోగ అవకాశం కల్పించే అంశాన్ని కూడా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. అయితే ప్రతి కేసును విడివిడిగా సమగ్రంగా పరిశీలించి, అభ్యర్థి నిబంధనల ప్రకారం నిజంగా అర్హుడా కాదా నిర్ధారించిన తర్వాతే తగిన నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉద్యోగుల వైద్య పరిస్థితి, అందుబాటులో ఉన్న వైద్య నివేదికలు, సంబంధిత శాఖల నుంచి సమర్పించే వివరాలను పరిగణనలోకి తీసుకుని నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, సహాయ కలెక్టర్ (శిక్షణలో) సాయి శివాని, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ




అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ శాఖాధికారి జరీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్టమైన పోలీసు బందోబస్తు

## - కీలక ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు.. నిమజ్జన రూట్లను పరిశీలించిన ఎస్పీ జానకి

## - క్లాక్ టవర్ కూడలిలో వాహనాల రాకపోకలకు ఆంక్షలు.. భారీ వాహనాలకు బైపాస్ మార్గం

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ దరావత్ జానకి జిల్లా పోలీసు అధికారులతో కలిసి శోభాయాత్ర, నిమజ్జనం జరిగే ప్రధాన మార్గాలు, కూడళ్లు, సున్నిత ప్రాంతాలు, నిమజ్జన పాయింట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అప్పన్నపల్లి ఈకో పార్క్ ఎదురుగా, పంచవతి స్కూల్ సమీపంలో, చిన్నదర్పల్లి సమీపంలో ఏర్పాటు చేసిన కృత్రిమ బేబీ పాండ్లను ఎస్పీ పరిశీలించారు. నిమజ్జన సమయంలో భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలు, పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణపై అధికారులకు సూచనలు చేశారు. చిన్న గణేష్ విగ్రహాల కోసం బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన కలెక్షన్ పాయింట్లను కూడా పరిశీలించారు. క్లాక్ టవర్ వద్ద నాలుగు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలుగణేష్ శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్లలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉన్నందున వాహనదారులు ముందుగానే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. సెప్టెంబర్ 21 సాయంత్రం 6 గంటల నుంచి సెప్టెంబర్ 25 ఉదయం 6 గంటల వరకు మహబూబ్‌నగర్ పట్టణంలోని క్లాక్ టవర్ కూడలి వద్ద అన్ని రకాల వాహనాల రాకపోకలకు అనుమతి ఉండదని పోలీసులు తెలిపారు.పట్టణ వాహనదారులు క్లాక్ టవర్ కూడలి వైపు వెళ్లకుండా ట్రాఫిక్ పోలీసులు సూచించే ప్రత్యామ్నాయ మార్గాలు, మళ్లింపులను పాటించాలని కోరారు. భారీ వాహనాలకు బైపాస్ మార్గంహైదరాబాద్, భూత్పూర్, రాయచూర్, కోయిలకొండ, చించోలి తదితర ప్రాంతాల నుంచి మహబూబ్‌నగర్ పట్టణంలోకి వచ్చే భారీ వాహనాలు తప్పనిసరిగా బైపాస్ రోడ్డును వినియోగించుకోవాలని జిల్లా పోలీస్ శాఖ సూచించింది. ట్రాఫిక్ నియంత్రణ చర్యలకు వాహనదారులు సహకరించాలని, పోలీసుల సూచనలను పాటించాలని కోరింది. డీజే సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదు:గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాల్లో డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగానికి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. భక్తి, సంప్రదాయాలకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహిస్తూ, అధిక శబ్దంతో ప్రజలకు, ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించరాదని సూచించారు.ఫేక్ న్యూస్‌ను నమ్మొద్దు.. ఫార్వర్డ్ చేయొద్దుగణేష్ ఉత్సవాలు, శోభాయాత్ర, నిమజ్జనం, ట్రాఫిక్ మళ్లింపులు, పోలీస్ బందోబస్తుకు సంబంధించి సోషల్ మీడియాలో వచ్చే అసత్య, నిర్ధారణ కాని సమాచారం, వదంతులు, పాత వీడియోలు, తప్పుదారి పట్టించే పోస్టులను నమ్మవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. ఏదైనా సమాచారం సోషల్ మీడియాలో కనిపించినప్పుడు దాని నిజానిజాలను నిర్ధారించుకోకుండా ఇతరులకు పంపడం లేదా ఫార్వర్డ్ చేయడం చేయరాదన్నారు. అనుమానాస్పద సమాచారం లేదా వదంతులు వ్యాప్తి చెందుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ప్రజలు పోలీసులకు సహకరించాలిగణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ డి. జానకి కోరారు. భక్తులు, ప్రజలు నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి, మహిళా పోలీస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్యతో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగాల భర్తీ

## - 22 నుంచి 26 వరకు దరఖాస్తుల స్వీకరణ

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ జిల్లా వైద్యారోగ్య శాఖలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ఒక సంవత్సరం కాలానికి ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసేందుకు జిల్లా యంత్రాంగం నోటిఫికేషన్ జారీ చేసింది. కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపడుతున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఉద్యోగాల ఖాళీలు, పోస్టుల వారీగా విద్యార్హతలు, వయోపరిమితి, ఎంపిక విధానం, ఇతర నిబంధనలు మరియు దరఖాస్తుకు సంబంధించిన పూర్తి వివరాలను మహబూబ్‌నగర్ జిల్లా అధికారిక వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులు సెప్టెంబర్ 22 నుంచి 26, 2026 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు. అన్ని రోజులలో దరఖాస్తులు స్వీకరించబడతాయని అధికారులు పేర్కొన్నారు. దరఖాస్తులను జిల్లా వైద్యారోగ్య కార్యాలయం (ఐడీఓసీ), రెండో అంతస్తు, గది నంబర్ 201, పాలకొండ, మహబూబ్‌నగర్లో సమర్పించాలని సూచించారు.అర్హత కలిగిన అభ్యర్థులు గడువు ముగిసేలోపు దరఖాస్తులు సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. వివరాల కోసం:మహబూబ్‌నగర్ జిల్లా అధికారిక వెబ్‌సైట్ »»mahabubnagar.telangana.gov.in»» (https://mahabubnagar.telangana.gov.in?utm_sourceRchatgpt.com)

# మాతృమరణాల నివారణకు పటిష్ట చర్యలు

## - ప్రతి గర్భిణీకి సకాలంలో వైద్య సేవలు అందించాలి : డీఎంహెచ్‌ఓ డా. ఏ. శ్రీనివాసులు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో చోటుచేసుకున్న మాతృమరణంపై వైద్యాధికారులు సమీక్ష నిర్వహించారు. అనారోగ్యానికి గురైన బాలింతను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై మరణానికి గల కారణాలను అధికారులు సమీక్షించారు. మహబూబ్‌నగర్‌లోని గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి సమావేశ మందిరంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు, గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య పర్యవేక్షణాధికారి డా. రంగా అజ్మీరా ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యులు, సిబ్బందితో పాటు గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి స్త్రీ వైద్య నిపుణులు సమావేశంలో పాల్గొని ఘటనకు సంబంధించిన వైద్యపరమైన అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి గర్భిణీని గర్భం దాల్చిన వెంటనే గుర్తించి నమోదు చేయడంతో పాటు, గర్భధారణ కాలంలో అవసరమైన ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రులకు వచ్చే గర్భిణులు, బాలింతలకు ఆలస్యం లేకుండా అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. గర్భిణీల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించి అవసరమైన సందర్భాల్లో మెరుగైన వైద్యం అందించే ఆసుపత్రులకు సకాలంలో తరలించే విధంగా సమన్వయం పెంచాలని సూచించారు. భవిష్యత్తులో మాతృమరణాలను తగ్గించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా స్థాయి ఆసుపత్రుల వరకు అన్ని స్థాయిల్లో పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. మాతృమరణానికి దారితీసే కారణాలను గుర్తించి, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో మాతా శిశు ఆరోగ్య కార్యక్రమ అధికారి డా. శంకర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. శైలజ, డా. శివకాంత్, డా. పులి విద్య, డా. అర్షదుల్లా, ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# మల్దకల్ పట్టణ లో ఎంబి.బిఎస్ సీట్ సాధించిన శ్రీలతకు ఆత్మీయ సన్మానం

**ఆలంపూర్ సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండల కేంద్రానికి సంబంధించిన మా ఆత్మీయ మిత్రుడు ఎంఆర్పిఎస్ తొలి ఉద్యమకారుడు, ప్రజా సంఘాల ఉద్యమ నాయకులు అమృత కుమార్ కూతురు ి. శ్రీలతకు ఎంబీ.బీఎస్ సీటు రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో డిపి.ఎం.ఆర్ మెడికల్ కాలేజీలో మొదటి లిస్టులోనే సీటు సంపాదించింది. ఇట్టి విషయం తెలుసుకొని ఆయన స్వగృహానికి వెళ్లి తల్లిదండ్రులుి. అమృత కుమార్ ి. స్వప్న గార్ల సమక్షంలో శాలువాతో సన్మానం చేసి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకోవాలని వైద్య వృత్తి ద్వారా ప్రజలకు, రోగులకు మరింత చేరువ కావాలని ఉన్న ఊరికి కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఈ సందర్భంగా కోరాశీ. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అయిజ ఆంజనేయులు మాదిగ, ఉప్పల దేవన్న మాదిగ పాల్గొన్నారులి.



# ఉచిత వైద్య సేవలు.. మందుల పంపిణీ యోగ, మెడిటేషన్తో ఆరోగ్యంపై అవగాహన

**ఆలంపూర్ సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

అయిజ మండలం సంకాపురం గ్రామంలో ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని సంకాపురం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ అండ్ వెల్నెస్ క్యాంప్ నిర్వహించారు. ప్రకృతి పరీక్షన్, పోషణ్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా అంగన్వాడీ కేంద్రాలతో సమన్వయంతో పలు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించి, ఆయుర్వేద ఆధారిత పోషణపై అవగాహన కల్పించారు. లైఫెల్ అసెస్మెంట్ ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానంపై సూచనలు అందించారు. యోగ, మెడిటేషన్ కార్యక్రమాలను నిర్వహించి శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం పలు వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజీవ్ జాగీర్దార్ , పంచాయతీ కార్యదర్శి , వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ వైద్యురాలు డాక్టర్ శిల్ప , యోగ సిబ్బంది కృష్ణ, సూర్య ప్రకాష్, త్రివేణి , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఖుష్బూ గుప్తా

## - ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు నిర్వహించాలి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని వినాయక మండపం వద్ద జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమానికి ముందు మండపంలో ప్రతిష్ఠించిన గణపతి విగ్రహానికి కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా తన చేతులతో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రజలు పరస్పరం సహకరించాలని సూచించారు.

### నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు

వినాయక విగ్రహాల నిమజ్జనానికి జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా కొన్ని చెరువులు, నీటి కుంటలు ఎండిపోయిన నేపథ్యంలో చిన్న, మధ్య తరహా వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యేకంగా బేబీ కుంటలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ప్రజలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుతంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించుకోవాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జన సమయంలో అధికారుల సూచనలు, భద్రతా నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, సహాయ కలెక్టర్ (ట్రైనీ) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరేందర్, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# ఫారం-6, 7, 8 దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

## - జిల్లా ఎన్నికల అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశాలు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా అందిన ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.సోమవారం రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల వారీగా దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఓటరు నమోదు, ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు, ఓటరు వివరాల సవరణకు సంబంధించి ఎన్నికల అధికారుల లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తులపై అవసరమైన విచారణలను సకాలంలో పూర్తి చేయాలని, విచారణకు సంబంధించి జారీ చేసిన నోటీసులు తప్పనిసరిగా సంబంధిత వ్యక్తులకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియలో ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉన్న దరఖాస్తులకు సకాలంలో పరిష్కారం చూపడంతో పాటు, అనర్హత లేదా అభ్యంతరాలకు సంబంధించిన అంశాల్లో కూడా నిర్దేశిత ప్రక్రియను పాటించాలని అధికారులకు సూచించారు. మహబూబ్‌నగర్‌లోని ఐడీఓసీ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఎన్నికల డీటీ జాఫర్ తదితరులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.



# బీరం హర్షవర్ధన్ రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యేలు

## - బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించిన

## - కూచుకుల్ల రాజేష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి బ్యూరో)**

పితృవియోగంలో ఉన్న కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, తండ్రి బీరం లక్ష్మారెడ్డి అనారోగ్య రీత్యా మృతి చెందిన విషయం విధితమే.. సోమవారం ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొల్లాపూర్ నియోజక వర్గం ఎత్తం గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ క్షేత్రం వద్ద సందర్శించి, మృతి చెందిన బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలు వేసి ఘనంగా...నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డికి ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. గతంలో మృతుడు లక్ష్మారెడ్డి సింగల్ విండో చైర్మన్ గా పలుమార్లు సేవలందించారని, జిల్లా వ్యాప్తంగా మంచి పేరు ఉందని ఈ సందర్భంగా కొనియాడారు. రాజకీయ నేపథ్యంలో రైతుల పక్షిపాతిగా ఉంటూ రైతుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. నాయకుల వెంట కాంగ్రెస్ శ్రేణులు, బి ఆర్ ఎస్ శ్రేణులు కుటుంబ సభ్యులు శ్రేయోభిలాషులు తదితరులు ఉన్నారు.



# భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులు వేగవంతం చేయాలి

## - లబ్ధిదారులకు పరిహారం సకాలంలో అందించాలి : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం పునరుద్ధరణ (ఆర్అండ్ఆర్) పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి ఇప్పటికే విడుదలైన నిధులను పెండింగ్‌లో ఉంచకుండా లబ్ధిదారులకు పరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనుల పురోగతిపై సోమవారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహబూబ్‌నగర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

**రూ.6 వేల కోట్ల వరకు భూసేకరణ నిధులు**

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 202627 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు రూ. 6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ. 1,050 కోట్లు, తాజాగా మరో రూ. 1,500 కోట్లు కలిపి మొత్తం రూ. 2,550 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కేటాయించిన నిధులకు అదనంగా అవసరమైనప్పుడు ఇతర వనరుల నుంచి నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. విడుదలైన నిధుల్లో అధిక భాగం అధికారుల ఖాతాల్లోనే ఉండి లబ్ధిదారులకు చేరకపోవడం సరికాదన్నారు. పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. నిధుల కొరత లేదా ఇతర కారణాల వల్ల చెల్లింపులు నిలిచిపోయినట్లయితే వివరాలను ప్రభుత్వానికి పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.

**రైతులతో చర్చించి భూసేకరణ**

భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని మంత్రి సూచించారు. నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు, రెవెన్యూ అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ పురోగతిని ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. భూసేకరణలో రైతుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులు రైతులతో నేరుగా చర్చించి స్నేహపూర్వక వాతావరణంలో ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం భూసేకరణ చేపట్టి రైతులకు అన్యాయం జరగకుండా, పరిహారం మార్కెట్ విలువకు సాధ్యమైనంత సమీపంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**అవార్డులు జారీ చేసిన భూములకు ముందుగా పరిహారం**



రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. అవార్డు జారీ అయిన తర్వాత కూడా దీర్ఘకాలం పరిహారం అందకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి పనులను వేగవంతం చేయాలని సూచించారు.

**రూ.2,504 కోట్ల నిధుల విడుదల**

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ. 3,101 కోట్ల విలువైన పనులను గుర్తించగా, రూ. 2,504 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలు పెరగడంతో అధిక పరిహారం కోరుతున్న కారణంగా కొంత ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు. భూసేకరణకు సంబంధించిన సమస్యలను హైదరాబాద్‌లోని భూసేకరణ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారు. ఇప్పటికే విడుదలైన రూ. 2,550 కోట్లను పూర్తిగా వినియోగించిన అనంతరం అవసరాన్ని బట్టి అదనపు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామిరెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల తనిఖీలను సమర్థవంతంగా నిర్వహించాలి

## - ప్యానల్ ఇన్‌స్పెక్షన్ టీమ్స్‌కు మార్గదర్శకాలు జారీ చేసిన ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్

## - ఎఫ్ఎల్ఎన్, బోధనాఅభ్యసన ప్రక్రియ, విద్యార్థుల అభ్యసన ఫలితాలపై ప్రత్యేక దృష్టి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



ప్రాథమిక స్థాయి పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్యానల్ తనిఖీలను ప్రణాళికాబద్ధంగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ సూచించారు. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రాథమిక స్థాయి ప్యానల్ ఇన్‌స్పెక్షన్ టీమ్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు నిర్వహించిన తనిఖీల పురోగతిని సమీక్షించిన ఆయన, తదుపరి తనిఖీల నిర్వహణకు సంబంధించి టీమ్స్‌కు పలు సూచనలు, మార్గదర్శకాలు అందించారు. తనిఖీల్లో కీలక అంశాలపై దృష్టితదుపరి తనిఖీ షెడ్యూల్ ప్రకారం టీమ్స్ పర్యటించే విధానం, పాఠశాలల్లో పరిశీలించాల్సిన ప్రధాన అంశాలు, తనిఖీల సమయంలో పాటించాల్సిన విధివిధానాలు, పరిశీలించిన అంశాలను సమర్థవంతంగా నమోదు చేసే విధానంపై ఏఎంఓ స్పష్టత ఇచ్చారు. పాఠశాలల తనిఖీలు కేవలం రికార్డుల పరిశీలనకే పరిమితం కాకుండా, విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరిచే అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. కాంప్లెక్స్ సమావేశాలపై ప్రత్యేక పరిశీలనఈ నెల 22, 24 తేదీల్లో నిర్వహించనున్న ప్రాథమిక స్థాయి పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలకు ప్యానల్ ఇన్‌స్పెక్షన్ టీమ్స్ హాజరై, సమావేశాల నిర్వహణ తీరును పరిశీలించాలని సూచించారు. కాంప్లెక్స్ సమావేశాలు నిర్దేశిత ఎజెండా ప్రకారం జరుగుతున్నాయా, ఉపాధ్యాయుల అకడమిక్ అంశాలపై తగినంత చర్చ జరుగుతోందా అనే విషయాలను పరిశీలించాలని తెలిపారు. అలాగే ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా సామర్థ్యాలు, బోధనా అభ్యసన ప్రక్రియ, విద్యార్థుల అభ్యసన ఫలితాలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చ జరుగుతున్నదా అనే విషయాన్ని కూడా గమనించాలని సూచించారు. ఉపాధ్యాయుల భాగస్వామ్యానికి ప్రాధాన్యంకాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయుల భాగస్వామ్యం, అకడమిక్ సమస్యలపై చర్చ, ఉత్తమ బోధనా పద్ధతుల పరస్పర పంచుకోవడం, విద్యార్థుల అభ్యసనను మెరుగుపరిచేందుకు రూపొందిస్తున్న కార్యాచరణ వంటి అంశాలను కూడా ప్యానల్ బృందాలు పరిశీలించాలని ఏఎంఓ తెలిపారు. జిల్లా స్థాయి ప్యానల్ ఇన్‌స్పెక్షన్ టీమ్స్ సమన్వయంతో తదుపరి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి, పాఠశాలల విద్యా ప్రమాణాల మెరుగుదలకు తనిఖీలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని దుంకుడు శ్రీనివాస్ సూచించారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

## - అధికారుల క్షేత్రస్థాయి పర్యటనలకు ప్రాధాన్యం..

## ప్రతి వారం గ్రామ పంచాయతీ సందర్శించాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21:శ్రీ ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను కేవలం కార్యాలయాలకు పరిమితం చేయకుండా అధికారులు నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు.సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యలను సావధానంగా విని, ప్రతి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. ప్రజావాణి దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా చదివి, సమస్య స్వభావాన్ని పూర్తిగా అర్థం చేసుకుని అవసరమైన చోట క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో మున్సిపల్, పంచాయతీరాజ్, నీటిపారుదల, సంక్షేమ, వ్యవసాయం, పౌరసరఫరాలు, భూ సర్వేరికార్డులు, గృహ నిర్మాణం, రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి, విద్యుత్, విద్య, వైద్యారోగ్యం, గనులు, అటవీ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 132 వినతులు స్వీకరించారు.

### ప్రతి వారం గ్రామ పంచాయతీని సందర్శించాలి

ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారుల క్షేత్రస్థాయి బాధ్యతలపై కలెక్టర్ సమీక్షించారు.ప్రత్యేక అధికారులు ప్రతి వారం క్షేత్రస్థాయిలో పర్యటించి, తమకు కేటాయించిన ఒక గ్రామ పంచాయతీని తప్పనిసరిగా సందర్శించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థ లేని నేపథ్యంలో మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారుల బాధ్యతలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయని తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కార్యాలయం నుంచి ఒక్కో అధికారికి ఒక గ్రామ పంచాయతీని కేటాయిస్తామని, సంబంధిత అధికారి అదే వారంలో ఆ గ్రామాన్ని తప్పనిసరిగా సందర్శించాలని సూచించారు. బుధవారం లేదా అనుకూలమైన మరో రోజున గ్రామాన్ని సందర్శించి, అక్కడి సమస్యలను గుర్తించాలని ఆదేశించారు.తదుపరి సోమవారం నిర్వహించే సమీక్షలో అధికారులు తాము సందర్శించిన గ్రామంలో పరిశీలించిన అంశాలు, గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

### ప్రజలతో నేరుగా మాట్లాడాలి

గ్రామ పర్యటనను సాధారణ తనిఖీగా కాకుండా ప్రజల సమస్యలను తెలుసుకునే అవకాశంగా అధికారులు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. సర్పంచ్, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలతో మాట్లాడి గ్రామంలోని ప్రధాన సమస్యలను గుర్తించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి హాజరు, పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, బోధన, విద్యార్థుల సమస్యలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి, భవన నిర్మాణాలు, తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్ల తదితర అంశాలను పరిశీలించాలని ఆదేశించారు. చిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా సాధ్యమైనంత వరకు స్థానికంగానే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

గ్రామ పంచాయతీ పర్యటనలో భాగంగా కనీసం రెండు పాఠశాలలను అధికారులు సందర్శించాలని కలెక్టర్ సూచించారు. వీటిలో ఒకటి రెసిడెన్షియల్ పాఠశాల, మరొకటి జెడ్పీ లేదా ప్రాథమిక పాఠశాల ఉండేలా చూడాలని తెలిపారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహారం నాణ్యత, విద్యార్థుల అభిప్రాయాలు, వసతి, వార్డెన్ల పనితీరు, ప్రిన్సిపాల్ నిర్వహణ, ఉపాధ్యాయుల సమస్యలు, తాగునీరు, మరుగుదొడ్ల పరిస్థితిని స్వయంగా పరిశీలించాలని సూచించారు. అధికారులు తమ విద్యార్థి దశ అనుభవాలను విద్యార్థులతో పంచుకుని వారిలో స్ఫూర్తిని నింపాలని అన్నారు. అదేవిధంగా గ్రామం లేదా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రం లేదా ఉపకేంద్రాన్ని సందర్శించి మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న సేవలు, తాగునీరు, పారిశుధ్యం, భవన పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు.

### క్షేత్ర పర్యటనల వివరాలు నమోదు చేయాలి

ప్రతి అధికారి తన క్షేత్ర పర్యటనకు సంబంధించిన వివరాలను నిర్దేశిత నమూనాలో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సందర్శించిన తేదీ, గ్రామం, గుర్తించిన సమస్యలు, మాట్లాడిన వ్యక్తులు, పరిష్కరించాల్సిన అంశాలను నమోదు చేయడంతో పాటు వారం, పది లేదా పదిహేను రోజుల తర్వాత తిరిగి పరిశీలించి సమస్య పరిష్కారమైందా లేదా తెలుసుకోవాలని సూచించారు.సాధ్యమైనంత వరకు ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, తద్వారా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అధికారులు సమర్పించే సమాచారం వాస్తవాధారంగా, విశ్వసనీయంగా ఉండాలని, ప్రతి పర్యటనకు సంబంధించిన రికార్డులను భద్రపరచాలని ఆదేశించారు.

### దిశా సమావేశానికి నివేదికలు సిద్ధం చేయాలి

అక్టోబర్ 6న దిశా సమావేశం జరగనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ పథకాలు, ఎంపీ ల్యాడ్స్ కింద మంజూరైన ప్రాజెక్టులు, ప్రస్తుతం అమలులో ఉన్న పనులు, పెండింగ్ అంశాలపై సమగ్ర నివేదికలను వెంటనే పీడీఆర్‌కు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. గత దిశా సమావేశంలో చర్చించిన అంశాలు, అధికారులకు ఇచ్చిన సూచనలు, వాటిపై







తీసుకున్న చర్యలకు సంబంధించిన చర్యల నివేదిక (ఏటీఆర్)ను కూడా సమర్పించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, సహాయ కలెక్టర్ (శిక్షణలో) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నరసింహులు, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉపేందర్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జె పి ఎన్ సి ఈ లో ఘనంగా ఐబి ఎం ఎనేషనల్ హ్యాకథాన్ విజయోత్సవం

**- జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో సౌత్ జోన్ స్థాయిలో నాలుగు బహుమతులు.. విద్యార్థులను అభినందించిన చైర్మన్ కేఎస్ రవికుమార్**

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జయప్రకాశ్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి ఐబీఎం హ్యాకథాన్‌లో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా విజేత విద్యార్థులను అభినందిస్తూ కళాశాల ఆడిటోరియంలో ప్రత్యేక విజయోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన ఈ జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో దేశవ్యాప్తంగా 80 బృందాలు పాల్గొన్నాయి. ఇందులో జేపీ ఎన్ సీ ఈ చెందిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగాల విద్యార్థులు సౌత్ జోన్ స్థాయిలో నాలుగు బహుమతులు సాధించడం విశేషం. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్ విజేత విద్యార్థులను అభినందించి ఘనంగా సత్కరించారు. ఐబీఎం సంస్థ తరఫున కళాశాలకు లభించిన ఎక్సలెన్స్ అవార్డు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు సాధించిన విజయాలు కళాశాలలో అందిస్తున్న సాంకేతిక శిక్షణకు, విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు.

**ఇంజినీరింగ్ విద్యా రంగంలో మరో ప్రతిష్ఠాత్మక అవార్డు:**

ఇటీవల న్యూఢిల్లీలో సెప్టెంబర్ 19న నిర్వహించిన 5వ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ్స్2026లో చైర్మన్ కేఎస్ రవికుమార్‌కు బెస్ట్ ఇంజినీరింగ్ కాలేజ్ అవార్డు లభించిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు.ఈ అవార్డును న్యూఢిల్లీకి చెందిన ఎన్సీ ఆర్టీసీ ఎండీ శాలభ్ గోయల్ చేతుల మీదుగా కేఎస్ రవికుమార్ స్వీకరించారు.

**సాంకేతిక నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలి**

ఈ సందర్భంగా చైర్మన్ కేఎస్ రవికుమార్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక రంగానికి అనుగుణంగా విద్యార్థులు తమ కోడింగ్ నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. హ్యాకథాన్‌లు, సాంకేతిక పోటీలు, పరిశ్రమ ఆధారిత శిక్షణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను జాతీయ స్థాయిలో చాటుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. కృష్ణమూర్తి, పరీక్షల నియంత్రణాధికారి కే. సందీప్ కుమార్, అధ్యాపకులు స్వాతి, హనుమంత నాయక్, ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని విజేతలను అభినందించారు. విద్యార్థులు జాతీయ స్థాయి వేదికలపై సాధిస్తున్న విజయాలు వారి సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి మాత్రమే కాకుండా కళాశాల ప్రతిష్ఠకు కూడా మరింత బలాన్ని చేకూరుస్తున్నాయని వారు పేర్కొన్నారు.






# బీరం హర్షవర్ధన్ రెడ్డిని పరామర్శించిన యువ నాయకులు

**- బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించిన**

**- బి ఆర్ ఎస్ యువ నాయకుడు శ్రీరామ్**

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి బ్యూరో)**

పితృవియోగంలో ఉన్న కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, తండ్రి బీరం లక్ష్మారెడ్డి అనారోగ్య రీత్యా మృతి చెందిన విషయం విధితమే.. సోమవారం కొల్లాపూర్ నియోజక వర్గం ఎత్తం గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ క్షేత్రం వద్ద మాజీ ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు, యువ నాయకుడు శ్రీరామ్, యువ నాయకులు సందర్శించి, మృతి చెందిన బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలు వేసి ఘనంగా...నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డికి ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి భగవంతుడు మనోధర్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. గతంలో మృతుడు లక్ష్మారెడ్డి సింగల్ విండో చైర్మన్ గా పలుమార్లు సేవలందించారని, జిల్లా వ్యాప్తంగా మంచి పేరు ఉందని ఈ సందర్భంగా కొనియాడారు. రాజకీయ నేపథ్యంలో రైతుల పక్షిపాతిగా ఉంటూ రైతుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని కొల్లాపూర్ నియోజక వర్గ యువ నాయకులు పేర్కొన్నారు. సంతాప కార్యక్రమంలో బి ఆర్ ఎస్ శ్రేణులు, శ్రేయోభిలాషులు తదితరులు ఉన్నారు.



# చనిపోయాక సానుభూతి కాదు.. బతికున్నప్పుడే అండగా నిలవాలి.!

## - ఒక మనిషి మృతి సమాజానికి ఇచ్చే సందేశం ఇదే.. మానవత్వం మాటల్లో కాదు, అవసరమైనప్పుడు చేసే చేతల్లో కనిపించాలి : మెట్టుకాడి ప్రభాకర్

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 21 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



మనిషి మన మధ్య ఉన్నప్పుడు పలకరించడానికి సమయం ఉండదు.. కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడానికి చేతులు ముందుకు రావు.. కానీ అదే మనిషి చనిపోతే మాత్రం సంతాపాలు, పూలమాలలు, నివాళులు, ఆర్థిక సహాయ ప్రకటనలు. ఇది నిజమైన మానవత్వమేనా.? ఓ జర్నలిస్టు శ్రీనివాస్ మృతి నేపథ్యంలో ఈ ప్రశ్న ఇప్పుడు సమాజాన్ని ఆలోచింపజేస్తోంది.శ్రీ అని మెట్టుకాడి ప్రభాకర్ అన్నారు. మనిషి ఉన్నప్పుడే సహాయం చేయాలి.. చనిపోయిన తర్వాత చూపించే సానుభూతి కంటే, బతికున్నప్పుడు అందించే చిన్న అండే ఎంతో విలువైనది. ఒక మంచి మాట.. ఆపదలో ఒక పలకరింపు.. అనారోగ్యంలో వైద్య సహాయం.. ఆర్థిక ఇబ్బందుల్లో కొంత అండ.. ఇవి బాధలో ఉన్న మనిషికి కొండంత ధైర్యాన్ని ఇస్తాయి. కానీ స్పందించేలోపే ఆ మనిషి మన మధ్య నుంచి శాశ్వతంగా దూరమైతే.. ఆ తర్వాత ఎంతటి సానుభూతి చూపినా కోల్పోయిన ప్రాణాన్ని తిరిగి తీసుకురాలేం.నాయకులు.. జర్నలిస్టులు.. సమాజం ఆలోచించాల్సిన సమయంప్రజలకు నాయకత్వం వహించే వారు, జర్నలిస్టు సంఘాలు, సామాజిక సంస్థలు, దాతలు, మిత్రులుతమ చుట్టూ ఉన్నవారి కష్టాలను గుర్తించే బాధ్యత తీసుకోవాలి. బతికున్న జర్నలిస్టు సమస్యలో ఉన్నప్పుడు అండగా నిలవాలి. అనారోగ్యంతో ఉన్నప్పుడు పరామర్శించాలి. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు చేతనైన సహాయం చేయాలి. అతని సేవలను బతికున్నప్పుడే గుర్తించి గౌరవించాలి.మరణం తర్వాత పూలమాలలు వేయడం కంటే.. బతికున్నప్పుడు అతని కళ్లలో ఆనందం కనిపించేలా చేయడం గొప్ప నివాళి. మనిషి చనిపోయిన తర్వాత కన్నీళ్లు తుడవడం కంటే.. బతికున్నప్పుడే ఆ కన్నీళ్లను తుడవడం నిజమైన మానవత్వం. మనిషి ఉన్నప్పుడే పలకరించండి..ఉన్నప్పుడే ఆదుకోండి..ఉన్నప్పుడే గౌరవించండి..ఎందుకంటే ఆలస్యమైన సానుభూతి ప్రాణాన్ని తిరిగి తీసుకురాదు.

# పిఆర్టియు టిఎస్ మఖ్తల్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



## - పిఆర్టియు టిఎస్ మండల అధ్యక్షుడిగా గోపాల్ రెడ్డి

## - పిఆర్టియు టిఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా జి.బాబు

**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి):**

మఖ్తల్ మండల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, పీఆర్టీయూ టీఎస్ మఖ్తల్ మండల కార్యవర్గం నిరంతరం పోరాడుతుందని పిఆర్టియు టిఎస్ మండల అధ్యక్షుడిగా గోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా మఖ్తల్ మండలంలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పిఆర్టియు టిఎస్ మఖ్తల్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. పిఆర్టియు టిఎస్ మఖ్తల్ మండల అధ్యక్షుడిగా గోపాల్ రెడ్డి,పిఆర్టియు టిఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా జి.బాబు,అసోసియేట్ అధ్యక్షుడిగా ఆర్.కే అశోక్ కుమార్,మహిళా అసోసియేట్ నాజియా బేగం,మండల ఉపాధ్యక్షుడు పి.వెంకట్ రెడ్డి,మహిళా ఉపాధ్యక్షులు హేమలత,కార్యదర్శి యం. ఆంజనేయులు మరియు వివేకానంద, మహిళా కార్యదర్శి తిరుమల మరియు కె.అనిత,కాంప్లెక్స్ ఇంచార్జుగా కె.అశోక్, టి.శ్వేత,రాఘవేంద్రచారి,అశ్విని,మమత, రాజేశ్వరి,సోషల్ మీడియా ఇంచార్జుగా డి.వెంకటేష్,నరేష్ రెడ్డి,శ్రీను నాయక్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రభుత్వం వెంటనే పీఆర్సీని ప్రకటించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.బాబు మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు.

# నారాయణపేట జిల్లాలో దారుణం -కన్నతండ్రిని కొట్టి చంపిన కొడుకులు



**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి):**

మఖ్తల్ మున్సిపాలిటీలోని 6వ వార్డు తిరుమలాపూర్ గ్రామంలో సోమవారం ఉదయం దారుణమైన ఘటన చోటు చేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో కన్న తండ్రిపై కుమారులు ఇనుప రాడ్ తో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన తిరుమలపూర్ గ్రామానికి చెందిన కోల్వార్ రాములును చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం:- కొంతకాలంగా తండ్రి కోల్వార్ రాములు (60), కుమారులు క్రిష్ణ, వెంకట్రాములు మధ్య కుటుంబ విషయాలపై గొడవలు జరుగుతుండేవని ఈ క్రమంలో సోమవారం కుమారులు ఇద్దరూ తండ్రి కోల్వారు రాములుపై ఇనుప రాడ్‌తో దాడి చేసినట్లు సమాచారం. ఈ దాడిలో రాములకు తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే కుటుంబ సభ్యులు,స్థానికులు రాములను చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మక్తల్ ఎస్సై రాజు యాదవ్ తెలిపారు.

# జూరాలలో నీళ్లున్నా పంటలు ఎండుతున్నాయెందుకు.?

## - రైతులకు సాగునీరు ఇవ్వాలని వెళ్తే బీఆర్ఎస్ నాయకుల అరెస్టులా.?

## - ఐదు టీఎంసీల నీటితో వానాకాలం పంటలను కాపాడవచ్చు: మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 21 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జూరాల ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉన్నప్పటికీ దేవరకద్ర నియోజకవర్గంలోని ఆయకట్టు పంటలు ఎండిపోతున్నాయని, రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వారి పక్షాన నిలబడుతున్న బీఆర్ఎస్ నాయకులను ప్రభుత్వం అరెస్టు చేయడం సరికాదని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు.

### "8.5 టీఎంసీలు ఉన్నా సాగునీరు ఎందుకు ఇవ్వడం లేదు.?"

జూరాల ప్రాజెక్టులో సుమారు 8.5 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు ఎందుకు విడుదల చేయడం లేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల తాగునీటి అవసరాలకు సుమారు రెండు టీఎంసీలతో సరిపెట్టవచ్చని, మరో ఐదు టీఎంసీల నీటిని వినియోగించి వానాకాలం పంటలను కాపాడే అవకాశం ఉందని అన్నారు.జూరాలకు వరదలు వచ్చిన సమయంలో నీటిని ఒడిసిపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, ఎత్తిపోతల పథకాల మోటర్లను పూర్తిస్థాయిలో నడపలేదని ఆయన ఆరోపించారు.

### "కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణకు అన్యాయం"

కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ప్రయోజనాలను ప్రభుత్వం కాపాడటం లేదని ఆల విమర్శించారు. ఈ సీజన్‌లో తెలంగాణ తక్కువ స్థాయిలో కృష్ణా జలాలను వినియోగించుకోగా, ఆంధ్రప్రదేశ్‌కు భారీగా నీరు తరలిపోయిందని ఆయన ఆరోపించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మోటర్లను నిరంతరాయంగా నడపడంలో ప్రభుత్వం విఫలమైందని, వరద నీరు వచ్చిన సమయంలో ఎత్తిపోతల ద్వారా నీటిని వినియోగించుకోకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు.

### "రైతులు నీళ్లు, కరెంటు, యూరియా అడుగుతున్నారు"

రైతులు సాగునీరు, విద్యుత్, ఎరువులు కోరుతున్నారని, కానీ ప్రభుత్వం రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తోందని ఆల ఆరోపించారు. కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే నీరు, విద్యుత్ వస్తాయని రైతులకు చెబుతున్నారని విమర్శించారు. వెలికిచర్ల రైతులకు కాలువ నిర్మిస్తామని హామీ ఇచ్చి పార్టీలో చేర్చుకున్నారని ఆయన ఆరోపించారు. సాగునీటి విషయంలో దేవరకద్ర ఎమ్మెల్యే అసెంబ్లీ సాక్షిగా వాస్తవాలకు విరుద్ధంగా మాట్లాడారని విమర్శించారు.

### "మూడేళ్ల తర్వాత కూడా కేసీఆర్‌ను తిట్టడమేనా?"

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు అవుతున్నా గత ప్రభుత్వాన్ని విమర్శించడంపైనే దృష్టి పెట్టిందని ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరంతరాయంగా సాగునీరు అందిందని,



ప్రస్తుతం అదే పరిస్థితి ఎందుకు లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలిసి జూరాల ఆయకట్టు రైతుల సమస్యలను వివరించాలని కోరారు. కర్ణాటకలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నందున, నీటి లభ్యత కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని సూచించారు.

### "ఐదు టీఎంసీలు విడుదల చేసి పంటలను కాపాడండి"

వానాకాలం పంటలు ఎండిపోకుండా కనీసం ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఆల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. జూరాల నుంచి సాగునీరు విడుదల చేసే వరకు బీఆర్ఎస్ రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.రైతులకు అండగా నిలిచి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని, పంటలు ఎండిపోకుండా కాపాడే బాధ్యతను జిల్లా బీఆర్ఎస్ నాయకులు తీసుకుంటారని తెలిపారు.

### రైతుబంధుపైనా విమర్శలు

రైతుబంధు పథకం అమలుపైనా ఆల వెంకటేశ్వర్ రెడ్డి విమర్శలు చేశారు. రైతుబంధు ఇస్తున్నామని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొంటున్నారని, అయితే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు 11 సార్లు అందించామని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికే మూడుసార్లు రైతుబంధు చెల్లింపుల్లో జాప్యం చేసిందని ఆయన ఆరోపించారు. సాగునీరు, విద్యుత్, ఎరువుల సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి జూరాల నీటిని ఆయకట్టుకు విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# కె. శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

## రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలి

## : దళిత జర్నలిస్టుల ఫోరం



**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 21 ( ప్రజా జ్యోతి బ్యూరో):**

దళిత జర్నలిస్టు కె. శ్రీనివాస్ మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి, బాధకు గురిచేసిందని దళిత జర్నలిస్టుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్ ఆవేదన వ్యక్తం చేశారు.జర్నలిజం రంగంలో పనిచేస్తూ తన వృత్తి బాధ్యతలను నిర్వర్తించిన కె. శ్రీనివాస్ ఆకస్మిక మరణం జర్నలిస్టు సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు దళిత జర్నలిస్టుల ఫోరం తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని, ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా నిలుస్తామని తెలిపారు.శ్రీనివాస్ కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని కాశపోగు జాన్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు, కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.జర్నలిస్టుల సంక్షేమం, ముఖ్యంగా అణగారిన వర్గాలకు చెందిన జర్నలిస్టుల కుటుంబాల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.